# సేవ్ డెమోక్రసి

- పార్లమెంట్‌పై దాడి .. ప్రజాస్వామ్యంపై జరిగినట్లే..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ ధర్నాచౌక్‌లో నిరసన




ధర్నాచౌక్‌లో నిర్వహించిన నిరసన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

కవాడిగూడ, డిసెంబర్ 22: పార్లమెంట్‌పై దాడి జరగడమంటే ప్రజాస్వామ్యంపై జరిగినట్లేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. దాడికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాని, హోంమంత్రిని అడిగితే హిట్లర్, ముస్సోలినిలా ప్రవర్తించి ఎంపీలను సస్పెండ్ చేశారని మండిపడ్డారు. పార్లమెంట్, రాజ్యసభలో విపక్ష ఎంపీల సస్పెన్షన్‌పై దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన సభ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ నిరసన సభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, ఎం. అంజన్‌కుమార్ యాదవ్, మల్లు రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... దేశ ప్రధాని, హోంమంత్రి హిట్లర్, ముస్సోలిని లాగా జైలుకు వెళ్లక తప్పదన్నారు. అగంతకులకు పాస్ ఇచ్చింది బీజేపీ ఎంపీలేనని, వారిని సస్పెండ్ చేశారా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఏమన్నారని సభ్యత్వం రద్దు చేశారని, అలాగే తృణమూల్ ఎంపీ ప్రశ్నిస్తే సభ్యత్వం రద్దు చేశారని తెలిపారు. నరేంద్ర మోదీ తప్పులను ఎండగట్టడానికి కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ... పార్లమెంట్‌కే రక్షణ లేకుంటే ప్రజలకు రక్షణ ఎవరని మండిపడ్డారు. సేవ్ డెమోక్రసి పేరుతో దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి నిరసనలు తెలుపుతున్నదన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ...రాబోయే రోజుల్లో మరిన్ని పుల్వామా దాడులు జరిగే అవకాశం ఉన్నదని ఆరోపించారు. పార్లమెంట్ ఘటనపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. విపక్ష సభ్యులను బయటికి పంపించడం సరైంది కాదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ముఖ్యమైన బిల్లులపై చర్చ జరుగుతుంటే అందరిని బయటికి పంపించి బలవంతంగా బిల్లులను ఆమోదింపజేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే విపక్ష సభ్యులను సభలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బాలికల సంక్షేమానికి ప్రాధాన్యం



చిన్నారులకు కానుకలను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క ,నిర్వాహకులు

మణికొండ, డిసెంబర్ 22 : వెనుకబడిన వర్గాల బాలబాలికల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యాపిల్ హోం రియల్‌నీడ్ ఇండియా పౌండేషన్ 'మిషన్ భద్రత'కు మద్దతుగా నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో రెండు రోజుల క్రిస్మస్ కార్నివల్ మిక్స్, మింగిల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. రెండు లక్షల మంది ఆడపిల్లలకు కానుకలను అందించడానికి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా చాలా మంది పేదరికంతో పాటు అనేక సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో అనారోగ్యాల భారిన పడుతున్నారని గుర్తు చేశారు. చిన్న పిల్లల అవసరాలను తీర్చడంలో ఆపిల్ హోం రియల్ నీడ్ సంస్థ అందిస్తున్న సేవలను మంత్రి ప్రశంసించారు. అనంతరం క్రిస్మస్ కార్నివల్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను మంత్రి సందర్శించారు. రెండురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతారని నిర్వాహకురాలు డాక్టర్ నీలిమా ఆర్యా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ విమలమ్మ, కిరణ్‌కుమార్, సుమన్ శరఫ్, శాన్య ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన మల్లయోధులు



జాతీయ స్థాయిలో ఎంపికైన
రెజ్లర్లను సన్మానిస్తున్న గ్రామస్తులు, పూర్వ రెజ్లర్లు, కోచ్‌లు

మణికొండ, డిసెంబర్ 22: జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు నార్సింగి మున్సిపాలిటీ ఖానాపురం గ్రామానికి చెందిన ఐదుగురు యువ రెజ్లర్లు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల ఎంపికలో 79 కేజీల విభాగంలో అజయ్‌కుమార్ బంగారు పతకం, 77 కేజీల విభాగంలో రాజు, 65 కేజీల విభాగంలో పవన్ రజత పతకం సాధించారు. వీరంతా జనవరి 2న రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు రెజ్లర్ శేఖర్ తెలిపారు. అలాగే ఖానాపురం వివేకానంద వ్యాయామశాలలో నిర్వహించిన పోటీల్లో 55కేజీల విభాగంలో కారుణ్య అనే అమ్మాయి బంగారు పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. అండర్ 19 విభాగంలో 74కేజీల విభాగంలో తలపడిన మాచర్ల రవికాంత్ బంగారు పతకాన్ని సాధించి, డిసెంబర్ 25న ఢిల్లీలో జరిగే అండర్ 19 జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపురం గ్రామ పూర్వ రెజ్లర్లు, పెద్దలు వారిని సన్మానించి అభినందించారు. రాష్ట్రానికి, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గున్నాల అమరేందర్‌రెడ్డి, సీనియర్ రెజ్లర్లు రమేశ్, రాజు, శేఖర్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మల్లేశ్, మాజీసర్పంచులు గండయ్య, నర్సింహా, యువ రెజ్లర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



## దానకిశోర్‌ను సన్మానించిన నేతలు

పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్‌ను టీజీవో, టీఎన్జీవో ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. టీజీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, టీఎన్జీవో శాఖ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఇతర సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవో జలమండలి శాఖ ఉపాధ్యక్షురాలు చంద్రజ్యోతి, ఈసీ మెంబర్ రమేశ్ బాబు, టీఎన్జీవో ప్రతినిధులు బిల్కిస్ బాను, అశ్విన్, బాలసుబ్రహ్మణ్యం, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

*– సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)*

## నేడు సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో శనివారం ఉదయం 10.30 నుంచి 11.15 నిమిషాల వరకు హకీంపేట్ ఎయిర్ పోర్స్ స్టేషన్‌కు వెళ్తుండటంతో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు తెలిపారు. లోతుకుంట టీ జంక్షన్, బిసన్ గేట్, హెలిప్యాడ్ వై జంక్షన్, యాప్రాల్ రోడ్డు, నవ్యా జంక్షన్, బొల్లారం చెక్‌పోస్టు, హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిపివేయడం, మళ్లించడం చేస్తామని పేర్కొన్నారు.

## హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ విజయం



తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ విజయం సాధించింది. శుక్రవారం కోఠిలోని డీఎంఈ ఆవరణలో నిర్వహించిన ఎన్నికల ఫలితాలను సాయంత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ సభ్యులు డాక్టర్లు ప్రతిభాలక్ష్మి, మహేశ్ కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఆనంద్, యెగ్గన్న, రవికుమార్, నరేశ్ కుమార్ , శ్రీకాంత్, సన్నీ, విష్ణు విజయ బావుటా ఎగురవేశారు. *– సుల్తాన్‌బజార్, డిసెంబర్ 22*

## ఫార్ములాతో లెక్కలు సులభం



గణితంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యన్, బిట్స్ ఫిలానీ సంచాలకులు సుందర్

జవహర్‌నగర్, డిసెంబర్ 22: దేశ ఆర్థిక వ్యవస్థ గణితంపైనే ఆధారపడి ఉందని, గణిత మేధావి రామానుజన్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యన్ పిలుపునిచ్చారు. శుక్రవారం బిట్స్ ఫిలానీ క్యాంపస్‌లో ఇండియన్ మ్యాథమేటిక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలసుబ్రహ్మణ్యన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితంలో ఫార్ములాతో ఎంత కష్టమైన లెక్కలను కూడా సులభంగా చేయవచ్చని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన పలువురికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మ్యాథమేటిక్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి యం.యం. శిఖారే, కార్యదర్శి రాజశేఖర్, బిట్స్ ఫిలాని సంచాలకులు ప్రొఫెసర్ జి. సుందర్, గణిత శాస్త్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.కె. సాహూ, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు, బిట్స్ ఫిలానీ సిబ్బంది పాల్గొన్నారు.

## సీబీఎస్ నుంచి కొల్లూరుకు ఐదు సిటీ ఆర్డినరీ బస్సులు

*ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న రాకపోకలు*

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలో సీబీఎస్ నుంచి కొల్లూరు వరకు ఐదు సిటీ ఆర్డినరీ బస్సు సర్వీసులను కొత్తగా ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్రతి రోజు ఉదయం 6గంటలకు సీబీఎస్ నుంచి, ఉదయం 7.45కు కొల్లూరు నుంచి మొదటి సర్వీసు ప్రారంభమయ్యే విధంగా టైమ్‌టేబుల్ విడుదల చేశారు. అయితే ప్రతి 40 నిమిషాలకు ఒక సర్వీసు అందుబాటులో ఉండే విధంగా ఐదు ఆర్డినరీ సర్వీసులను అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. సీబీఎస్ నుంచి అఫ్జల్‌గంజ్, గాంధీభవన్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, టోలిచౌకి, బృందావన్‌కాలనీ, దర్గా, కాజాగూడ ఎక్స్‌రోడ్, నానక్‌రామ్‌గూడ, విప్రో సర్కిల్, గోపన్నపల్లి, తెల్లాపూర్ ఎక్స్‌రోడ్, కొల్లూరు విలేజ్‌కి చేరుకునే విధంగా ఆర్డినరీ బస్సులు నడుపుతామని తెలిపారు.



చలి తీవ్రత దృష్ట్యా పారిశుధ్య కార్మికులు చాలా ఇబ్బందులు, అనారోగ్యాలకు గురవుతున్నారని, బయోమెట్రిక్ మెషిన్ సమయాన్ని గంట పాటు పొడిగించాలని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు శుక్రవారం కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు తిప్పర్తి యాదయ్య, సీహెచ్ కృష్ణ, జగన్‌మోహన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

*- సిటీబ్యూరో, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ)*

## టీఎస్‌ఐసీ ఇన్నోవేటర్‌కు అవార్డు



అమర రాజా గ్రూపు 38వ వార్షిక వేడుకల్లో ఉత్తమ వ్యవసాయ వ్యాపార అవార్డును అందుకుంటున్న దీపక్ రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఇన్నోవేటర్‌కు ఉత్తమ వ్యవసాయ వ్యాపార అవార్డు దక్కిందని టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డా.శాంతా తౌటం తెలిపారు. అమర రాజా గ్రూపు 38వ వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టీఎస్ఐసీ ఇన్నోవేటర్ అయిన దీపక్ రెడ్డికి ఉత్తమ వ్యవసాయ వ్యాపార అవార్డును ప్రదానం చేశారని తెలిపారు. అతడు రూపొందించిన 'స్టోన్ పిక్కర్' ఆవిష్కరణ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని చెప్పారు. గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహించడంలో టీఎస్ఐసీ ఎంతో కృషి చేస్తోందన్నారు. దీపక్‌రెడ్డికి రూ.3లక్షల నగదు బహుమతితో పాటు బిజినెస్ డెవలప్‌మెంట్, ఫైనాన్స్, సప్లయ్ చైన్, హెచ్‌ఆర్ వంటి కీలక వ్యాపార రంగాల్లో ఒక ఏడాది పాటు మెంటార్‌షిప్‌ను అమర రాజా గ్రూపు అందిస్తుందని శాంతా తౌటం తెలిపారు.